ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల
జిల్లా వార్తలు

3

గురువారం 4 జూలై 2024

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

శ్రీరాంపూర్, జూలై 3: కార్మికులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సింగరేణి ఏరియా వైద్యాధికారి లోక్‌నాథ్ రెడ్డి అన్నారు. ఆర్‌కె 7 గనిపై వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై ఆయన అవగాహన కల్పించారు. నివాస స్థలాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని, డెంగీ, మలేరియా, తదితర వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఏ వ్యాధి అయినా వచ్చిన తరువాత వైద్యం పొందేబదులు రాకుండా జాగ్రత్తగా ఉండడం మేలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ శ్రీధర్, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు కొట్టి కిషన్ రావు, పిట్ కార్యదర్శి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

చెన్నూరు, జూలై 3: పోలీసులు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ సూచించారు. బుధవారం చెన్నూరు పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చేఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి రశీదులను ఇవ్వాలని , వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. అలాగే డయల్ 100 ఫిర్యాదుల పట్ల వేగంగా స్పందించాలని సూచించారు. కొత్త చట్టాలపై అవగాహన పెంచుకుని సమర్ధవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. రాబోయే వర్షాలను దృష్టిలో ఉంచుకుని మండలంలోని వరద ముంపు ప్రాంతాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్వేత, ఎస్ఐ వెంకటేశ్వర్‌రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

ఏసీసీ, జూలై 3: జిల్లాలో గురువారం నిర్వహించే కేజీ టూ పీజీ విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వీజేఎస్,పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్,ఎన్ఎస్‌యూఐ నాయకులు మాట్లాడారు. కేంద్రంలో లక్ష రూపాయలకు నీట్ పరీక్ష పత్రాలు లీక్ చేసి 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చెలగాటమాడిందన్నారు. దేశావ్యాప్తంగా ఈ విషయంపై ఆందోళనలు చేస్తున్నా ప్రధాని మోదీ ఇంత వరకు స్పందించకపోవడం దారుణమన్నారు. బంద్‌కు అందరు సహకరించాలని కోరారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో నాయకులు ప్రవీణ్, శ్రీకాంత్, ఆదర్శ్, రెడ్డి చరణ్, అభినవ్ , అభిరామ్, సిరాజ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అండర్‌బ్రిడ్జిలో చేరిన వర్షపునీరు

- రాకపోకలకు ప్రయాణికుల అవస్థలు



అడర్‌బ్రిడ్జిలో చేరిన వర్షపు నీరు

మంచిర్యాల అర్బన్, జూలై 3: జిల్లా కేంద్రంలో మంగళవారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి నూతన రైల్వే అండర్‌బ్రిడ్జిలోకి వర్షపు నీరు చేరింది. దీంతో బుధవారం మధ్యాహ్నం వరకు రాకపోకలకు అంతరాయం కలిగింది. పనికోసం వన్‌టౌన్‌కు తప్పనిసరిగా వెళ్లాల్సిరావడంతో హమాలీవాడ వాసులు అవస్థలు పడ్డారు. మరో మార్గం లేక పోవడంతో పాత అండర్ బ్రిడ్జి గుండా తమ ప్రయాణాలను సాగించారు. సంబంధిత రైల్వే అధికారులు వర్షపు నీటినంతా మోటర్ల సహాయంతో ఓయటకు పంపింగ్ చేయించారు. ఈ మేరకు మధ్యాహ్నం నుంచి రాకపోకలను పునరుద్ధరించారు.

ఘనంగా డాక్టర్స్ డే

మంచిర్యాల అర్బన్, జూలై 3: మంచిర్యాల లయన్స్ క్లబ్ లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జి 2024-25 సంవత్సరానికి డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా నియమించబడిన నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం డాక్టర్స్ డే, చార్టెడ్ అకౌంటెంట్ డే, పోస్టల్ వర్కర్స్ డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ డాక్టర్స్ విష్ణువర్దన్ రావు, నాగమల్లేశ్వరరావు, బద్రి నారాయణ, చంద్రదత్, పి.రమణ, చార్టెడ్ అకౌంటెంట్స్ గడ్డం సూర్యప్రకాష్, శ్యాంసుందర్ సోనిలను, పోస్టల్ వర్కర్స్ పి.రవీందర్, గంగయ్యలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఫస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ హనుమాండ్ల రాజిరెడ్డి, ఫస్ట్ వాయిస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సింహరాజు కోదండ, సెకండ్ వాయిస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మోక బద్రేశం, క్యాబినెట్ సెక్రటరి వాలేటి శ్రీనివాస్, డిసీటీ క్యాబినెట్ ట్రెజరర్ ఇరుకుల ఆనంద్, మైక్రో క్యాబినెట్ మెంబర్స్ వి.మధుసూదన్ రెడ్డి, వినయ్‌కుమార్, హన్మంతరావు, ఎస్.సూర్యనారాయణ, సుగుణాకర్ రెడ్డి, సిరిపురం శ్రీనివాస్, బాల్ మోహన్, గుండా శ్రీనివాస్, రీసన్ చైర్‌పర్సన్, జోన్ చైర్‌పర్సన్స్ పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌కు సన్మానం

మందమర్రి టౌన్, జూలై 3: జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ ఈర్ల శంకర్‌ను బుధవారం కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుంట శ్రీశైలం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రెండో విడత గొర్రెల పంపిణీకి సంబంధించి డీడీలను సత్వరమే ఇప్పించాలని కోరారు. డీడీలు అందక అప్పులు చేసి వాటికి వడ్డీలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడుకుమార్, కోర రంజిత్, మధు, శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వీరయ్య, అన్నం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

మంచిర్యాల అర్బన్, జూలై 3: జైపూర్ మండలం పెగడపల్లి గ్రామానికి చెందిన బొమ్మగోని సాయిచందర్ గౌడ్, శంకర్‌గౌడ్ అనే వ్యక్తులపై నూతన చట్టాల ప్రకారంగా మహిళా పోలీస్ స్టేషన్‌లో వేధింపుల కేసు నమోదు చేసినట్లు స్టేషన్ ఏఎస్సై పి రాజయ్య తెలిపారు. సాయిచందర్ భార్య తన భర్తతో పాటు తన భర్తకు బాబాయి అయిన శంకర్‌గౌడ్‌లు గత కొంతకాలంగా వేధిస్తున్నారంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రత్యేక అధికారుల నియామకం

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 3: ఎంపీపీల పదవీ కాలం ముగియడంతో 16 మండలాలకు ప్రత్యే క అధికారులకు నియమించారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఆయా మండలాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్వర్వులు జారీ చేశారు.

ఆరు గ్యారంటీ పథకాలు వర్తింపజేయాలి

దండేపల్లి, జూన్ 3: అర్హులైన ప్రజలందరికీ ఆరు గ్యారంటీ పథకాలు వర్తింపజేయాలని బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీవో ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సిబ్బంది ఆన్‌లైన్ చేసే క్రమంలో లబ్ధిదారుల వివరాలు తప్పుగా నమోదు చేశారని చెప్పారు. దీంతో 200లోపు యూనిట్ ఉచిత విద్యుత్, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందకుండా పోయిందన్నారు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, గూడెం పీఏసీఎస్ చైర్మన్ బేడుద సురేష్, నాయకులు రవిగౌడ్, శ్రీనివాస్, కిషన్, సురేందర్, వెంక టేశ్వర్లు, సత్తయ్య, శ్రీనివాస్, రాకేష్, అశోక్, మల్లేష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

డీసీపీని కలిసిన కమాండెంట్

హాజీపూర్, జూలై 3: మంచిర్యాల డీసీపీ భాస్కర్‌ను బుధవారం గుడిపేట 13వ బెటాలి యన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ భాష మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీసీపీకి పూల మొక్కను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ కాళిదాసు, ఆర్ఐ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

హాజీపూర్, జూలై 3: జిల్లాలోని ఎంజేపీ డిగ్రీ కళాశాలలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 8వ తేదీలోగా గుడిపేటలోని మహాత్మాజ్యోతి బాపుఫూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో దరఖాస్తులను అందజేయాలని కోరారు. అర్హులైన అభ్యర్థులకు స్పాట్ నిర్వహించి సీటట్లు కేటాయిస్తామని, వివరాల కోసం 9948989949, 7993456620లో సంప్రదించాలని సూచించారు.

నల్ల జెండాలతో ర్యాలీ

కాసిపేట, జూలై 3: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానా లను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం సోమగూడెం, మల్కేపల్లి గ్రామా ల్లో నల్లజెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలం పాటలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం దీన్ని వెనక్కి తీసుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జంగుబాయి, రాజకుమారి, లింగయ్య, ప్రణయ్‌కుమార్, శ్రీనివాస్, పోశం, భాగ్య, మొగిలి, నాగమణి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లలు వచ్చేనా..?



- పథకం గురించి పట్టించుకోని ప్రభుత్వం
- వానాకాలం మొదలైనా.. టెండర్ల ఊసే లేదు
- ఆందోళనలో మత్స్యకారుల కుటుంబాలు
- గత ఏడాది 368 చెరువులు, కుంటలకు పంపిణీ

ఓ వైపు వానాకాలం మొదలైనప్పటికీ చేప పిల్లల పంపిణీ పథకం అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి ప్రక్రియ చేపట్టలేదు. వాస్తవానికి ఇప్పటికే టెండర్ ప్రక్రియను ప్రారంభిం చాలి. కాగా అలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

నస్పూర్, జూలై 3: మత్స్య సంపద పెంచి ఉపాధి అవకాశాలు మెరుగు పరుచాలన్న చేప పిల్లల పంపిణీ పథకంపై నీలినీడలు అలుముకున్నాయి. ఇప్పటి వరకు వాటిపై ఊసే లేకుండా పోయింది. వర్షాలు కురిసి చెరువులు, కుంటలు, జలశయాల్లో సమృద్ధిగా నీరు చేరగానే చేప పిల్ల చెరువుకు చేరేది. ప్రస్తుతం అందుకు భిన్నంగా పరిస్థితులు మారిపోయాయి. ఈ ఏడాదిలో చేప పిల్లల పంపిణీ కార్యక్రమం లేనట్లే కనిపిస్తోంది. జిల్లాలో 368 చెరువులు, కుంటలు, ఆరు చిన్న,మధ్య తరహా ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 125 మత్స్య సహకార సంఘాలు ఉన్నాయి. ఇందుల్లో దాదాపు ఏడు వేల వరకు మత్స్యకారులు సభ్యులు కొనసాగుతున్నారు. అడపాదడపా కురుస్తున్న వానల కారణంగా చెరువులు, రిజర్వాయర్లలోకి కొద్దికొద్దిగా నీరు చేరుతోంది. జూలై, సెప్టెంబరు నెలల్లో చేప పిల్లలను వదిలిపెట్టాల్సిన ప్రక్రియలో ఏ మాత్రం కదలిక కనిపించడం లేదు. దీంతో మత్స్యకారులు ఆందోళన చెందాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

● జిల్లా వ్యాప్తంగా..

జిల్లాలో 18 మండలాలు, 311 గ్రామ పంచాయతీల పరిధిలో 368 కుంటలు, చెరువులు, ఎల్లంపల్లి, సుందిళ్ళ, అన్నారం ప్రాజెక్టులతో మరో మూడు చిన్న తరహా ప్రాజెక్టులు ర్యాలీ వాగు, నీల్వాయి వాగు, గొల్లవాగు ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల్లో రవ్వు, బొచ్చ, బంగారు తీగ, రోయ్యలు తదితర వాటిని పెంపకం చేసేవారు. తద్వారా మత్స్య కారుల ఉపాధి లభించేది. చేప పిల్లలు ఒక హెక్టారుకు దాదాపు మూడు వేల పిల్లలను వదిలిపెడుతారు. చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల విస్తీర్ణాన్ని బట్టి నీటి సామర్థ్యానికి అనుగుణంగా రకరకాల చేప పిల్లలను విడిచి పెడుతారు. వర్షకాలంలో చెరువు, కుంటలు, జలాశయాల్లో సమృద్ధిగా నీరు చేరడంతో వివిధ రకాల చేప పిల్లలను మత్స్యశాఖ ఆధ్వర్యంలో పంపిణీ జరిగేది. జిల్లాలో చేపల వ్యాపారానికి మంచి గిరాకీ లభిస్తోంది. ఇత ర ప్రాంతాల నుంచి కూడా వివిధ రకాల చేపలు ఇక్కడకు వ్యాపారులు తరలించి విక్రయిస్తారు. మత్స్యకార కుటుంబాలు చేపలను పట్టుకుని జీవనోపాధిని పొందేవారు. వందలాది కుటుంబాలు చెరువులు, కుంటలు, ప్రాజెక్టులపై ఆధారపడి జీవి స్తున్నాయి. వాస్తవంగా జూన్‌లో వర్షాలు మొదలైతే చెరువులు, ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరడంతో నీటి మట్టం పెరుగుతోంది. జూలై, సెప్టెంబరు నెలల్లో చేప పిల్లలను నీటి వదలాల్సి ఉంటుంది. సకాలంలో వదిలితేనే బరువు పెరిగి మ త్స్యకారులకు లాభాలు వస్తాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాక పోవడంతో అధికారులు ప్రతిపాదనలు పంపలేదు. సీజన్ ఇంకా ఉన్నందున త్వరగా ప్రభుత్వ ఆదేశాలు ఇవ్వాలని మత్స్యకారులు కోరుతున్నారు.

● ఈ ఏడాది తీవ్ర జాప్యం..

ఈ ఏడాది ఇప్పటి వరకు చేప పిల్లల పంపిణీ చేయాలన్నా ఊసే లేకుండాపోయింది. చేప పిల్లల పంపిణీ తీవ్ర జాప్యం జరు గుతుంది. సీజన్ మొదలైన తరువాత కూడా వర్షాలు ఆశించిన విధంగా కురువలేదు. వర్షకాలంకు ముందుగానే చేప పిల్లల కోసం ప్రభుత్వం టెండర్లు పిలిచి జిల్లాకు ఏ రకం చేప పిల్లలు కావాలి, ఎన్ని టన్నుల పిల్లలు అవసరమో ప్రణాళిక రూపొందించి పంపిణీ చేసేది. ప్రభుత్వం తరుపున చేప పిల్లల పంపిణీ పై ఏలాంటి కదలికలు లేకుండా పోయాయి. దీంతో ఈ ఏడాదిలో చేప పిల్లల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుందా అనే అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంపై ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్ రామ్‌ధన్‌ను వివరణ కోరగా ప్రభుత్వం నుంచి చేప పిల్లల పంపిణీ కోసం ఏలాంటి ఆదేశాలు రాలేదన్నారు. ఆదేశాలు రాగానే ప్రక్రియ మొదలవుతుందని తెలిపారు.



సీతారాంపల్లి వద్ద గోదావరి నదిలో చేప పిల్లలను వదులుతున్న అధికారులు (ఫైల్)

ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావించాలి

- ఎంపీపీ గడ్డం శ్రీనివాస్

దండేపల్లి, జూలై 3 ప్రజల సేవ చేసేందుకు అవకాశం రావడం ఆదృష్టంగా భావించాలని ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ అన్నారు. దండేపల్లి మండల పరిషత్ కార్యలయంలో బుధవారం ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ అధ్యక్షతన మండల సర్వసభ్య చివరి సమావేశం నిర్వహించారు. ఎంపీపీ, జడ్పీటీసీ ఎంపీటీసీల పదవీకాలం ముగియడంతో వారికి వీడ్కోలు సమావేశం నిర్వహించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జడ్పీటీసీ గడ్డం నాగరాణిలు మాట్లాడుతూ పదవిలో ఉన్న లేకున్న నిరంతరం ప్రజల సేవలో ఉంటామని, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోని అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కరం కోసం కృషి చేస్తామన్నారు. అనంతరం ఇటివల లక్షెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైౖ ధర్మరావుపేట కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకడు దాసరి ప్రేమ్ చందును సత్కారించి మెమెంటో అందజేశారు. అనంతరం ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జడ్పీటీసీ గడ్డం నాగరాణి-త్రిమూర్తి, ఎంపీటీసీలు ముత్తె రాజన్న, కొంగల నవీన్‌కుమార్, చుంచు మల్లవ్వ-లక్ష్మయ్య, బోడ అమృత బాయి, మండల కో ఆప్షన్ సభ్యుడు ఆల్లోరోద్దీన్‌లను మండల పరిషత్ కార్యాలయ అధికారులు, మండల స్థాయి అదికారులు, మండల నాయకులు ఘనంగా సత్కారించారు. సమావేశంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీటీసీ జేఆర్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ గడ్డం శ్రీనివాస్

విద్యార్థినులకు అభినందన

కోటపల్లి, జూలై 3: కోటపల్లి మండలంలోని మోడల్ స్కూల్, కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులకు ట్రిపుల్ ఐటీలో సీటు రావడంతో బుధవారం ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డితో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. మంగళవారం బాసర ట్రిపుల్‌ఐటీ నుంచి విడుదలైన ఫలితాల్లో ఈ పాఠశాలకు చెందిన పుట్ట హన్సిక, ఇప్ప శ్రీనిధి, జకాని జశ్వితలకు సీట్లు లభించాయి. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పుట్ట హన్సిక 10 జీపీఏ, ఇప్ప శ్రీనిధి, జకాని జశ్వితలు 9.8 జీపీఏ సాధించారు.

మందమర్రిరూరల్: మందమర్రి మండలంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు బాసర ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యా రని ప్రిన్సిపాల్ జయకృష్ణరెడ్డి బుధవారం తెలిపారు. రిషి తవర్మ, కె. భార్గవి, ఎం.చిన్మయి ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో పా టటు పలువురు అభినందించారు.

ఏకరూప దుస్తులు అందజేత

మందమర్రి టౌన్, జూలై 3: పట్టనంలోని శ్రీపతినగర్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో విద్యార్థులకు బుధవారం ఏకరూప దుస్తులను అందజేశారు. డీఆర్‌డీఏ జిల్లా అధికారి కిషన్ మాట్లాడుతూ ఐక్యతకు చిహ్నాలు ఏకరూప దుస్తులు అని అంగన్‌వాడీ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఏక రూప దుస్తులను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ చిన్నయ్య, వియోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్, సీడీపీవో విజయలక్ష్మి, సూపర్వైజర్లు స్వప్న, టీచర్లు భాగ్యలక్ష్మి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

మందమర్రిరూరల్, జూలై 3 : నేటి సమాజం అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోని ముందుకు సాగాలని జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి ఓదెలు పేర్కొన్నారు. బుధవారం ఆదిల్‌పేట గ్రామ చౌరస్తాలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగద మాట్లాడుతూ ప్రపంచ గర్వించదగ్గ మేధావి డాక్టర్ అంబేద్కర్ అని ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. , కార్యక్రమంలో జడ్పీటీసీ వేల్పుల రవి , ఎంపీపీ గుర్రం మంగశ్రీనివాస్‌గౌడ్, కో ఆప్షన్ నజీరొద్దీన్, దళిత సంఘాల నాయకులు, అంబేద్కర్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ తరగతులు

చెన్నూరు, జూలై 3: కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పేద విద్యార్థులను పోటీ పరీక్షల ను సన్నద్ధం చేయడం కోసం ఈ నెల 8 నుంచి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్‌శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ అవర్‌నెస్, కరెంటు అఫైర్స్, రీజ నింగ్ మ్యాథమేటిక్స్, జనరల్ ఇంగ్లీష్ మొదలైన అంశాలపై శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకుని తరగతులకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థులకు నగదు బహుమతి

రామకృష్ణాపూర్, జూలై 3: తవక్కల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సెమ్స్ ఒలింపియాడ్ పరీక్షలో జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించడంతో బుధవారం హైదరబాద్‌లోని రవీంద్రభారతిలో సెమ్స్ ఒలింపియాడ్ కన్వీనర్ చేతుల మీదుగాబంగారు పథకం, నగదు బహుమతులను అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ అబ్దుల్ అజీజ్ మాట్లా డుతూ గత సంవత్సరం నిర్వహించిన ఐదో సెమ్స్ ఒలింపియాడ్ పరీక్షకు విద్యార్థులు హాజరు కాగా ఈ నెల 2న ఫలితాలు ప్రకటించారని చెప్పారు. రామకృష్ణాపూర్ తవక్కల్ పాఠశాలకు చెందిన జె అంబిక(ఐదో తరగతి), జె సాత్విక్ వర్మ (నాలుగో తరగతి), మందమర్రి తవక్కల్ పాఠశాలకు చెందిన పి హర్షిత్(మూడో తరగతి), మంచిర్యాల తవక్కల్ పాఠశాలకు చెందిన మలిహ అంజుం(ఐదో తరగతి)లు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారని తెలిపారు.

స్థలం కేటాయించాలని వినతి

జైపూర్, జూలై 3: మండల కేంద్రంలో జైపూర్ గ్రామ సమైక్య సభ్యులు సమావేశాలు నిర్వహించుకోవడానికి స్థలం కేటాయించి భవనం నిర్మించాలని బుధవారం తహసీల్దార్ వనజారెడ్డికి గ్రామ సమైక్య సభ్యులు సునీత వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమకు సమావేశాలు నిర్వహించుకోవాలంటే ఇబ్బందిగా ఉందని, వెంటనే స్థలం కేటాయించి భవనం నిర్మించేలా కృషి చేయాలని కోరారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్

భీమిని, జూలై 3: ప్రతి ఒకరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో బుధవారం నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ప్రతీ మొక్కకు ట్రీగార్డ్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో వన మహోత్స కార్యక్రమాల్లో ప్రజలందరినీ భాగస్వాములను చేయాలన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల ఆశ్రమ పాఠశాలను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు భోధించి ఉపాధ్యాయుడిగా మారారు. పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించి మ్యాథ్స్, ఇంగ్లీష్, సైన్స్ సంబంధించిన అంశాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం పెద్దపేట, వెంకటాపూర్ గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలలో సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. పెద్దపేట, వెంకటాపూర్ పాఠశాలల్లో ఆక్రమణలు వెంటనే తొలగించి స్వాధీనం చేసుకోవాలని వారు స్వాధీన పరచకుంటే కబ్జా చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బిక్కర్ణ దాస్, ఎంపీడీఓ గంగామోహన్, ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరిలక్ష్మణ్, జెడ్పీటీసీ పోతురాజుల గంగమ్మ, వైస్ ఎంపీపీ చిలుముల మధు, కోఆప్షన్ సభ్యుడు ఆరీఫ్, ఏపీఓ భాస్కర్ రావు, కేజీబీవీ ఎస్ఓ కవిత, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

జన్నారం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. మండలంలోని మొర్రిగూడెం గ్రామంలో బుధవారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పచ్చదనాన్ని పెంపొందించేందుకు వన మహోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. చెట్ల ద్వారా స్వచ్ఛమైన గాలి లభిస్తుందని తెలిపారు. భావి తరాలు ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలంటే ప్రతి ఒక్కరు ప్రకృతిని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: మనిషి జీవితంలో అతి ముఖ్యమైన వృక్షాలే అని, భవిష్యత్ తరాలకు మనమందరం బాసటగా నిలువాలని జడ్పీటీసీ సభ్యురాలు గడ్డం నాగరాణి-త్రిమూర్తి, ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం దండేపల్లి మండల పరిషత్ కార్యలయావరణలో పలు చోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీటీసీలు రాజన్న, నవీన్, మల్లవ్వ, అమృతబాయి, ఎంపీవో శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీవో దుర్గదాస్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని జ డ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మిఓదెలు పేర్కొన్నారు. బుధవారం ఆదిల్‌పేట గ్రామంలో వన మహోత్సవంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, జెడ్పీటీసీ వేల్పుల రవి, ఎంపీపీ గుర్రం మంగశ్రీనివాస్‌గౌడ్, కో ఆప్షన్ నజీరొద్దీన్, ఏపివో రజియా సుల్తానా, కార్యదర్శి హిమబిందు , ఈద లింగయ్య, తదితరులు పా ల్గొన్నారు. అలాగే అందుగులపేటలో కాంగ్రెస్ నాయకులు జీవన్ కుమార్,నరేష్, మామిడిగట్టులో ఎంపీడీవో రాజేశ్వర్ మొక్కలు నాటారు. కార్యదర్శి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: మొక్కలు నాటి సంరక్షించాలని డీఎఫ్‌వో శివ్‌ఆశిష్‌సింగ్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా బుధవారం శాంతిఖని గని ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జీఎం మనోహర్, ప్రాజెక్టు అధికారి విజయప్రసాద్, ఎఫ్‌డీవో విజయ్‌కుమార్,ఎఫ్ఆర్‌వో సుభాష్‌గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, ఎస్‌వోపీ రాజు,పిట్ ఇంజనీర్ రాంబాబు, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: మొక్కలతోనే మానవ మనుగడ కొనసాగుతుందని డీఎఫ్‌వో ఆశిష్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో బెల్లంపల్లి డివిజన్ అధికారి విజయ్‌కుమార్, అటవీ క్షేత్రాధికారి సుభాష్, డిప్యూటి రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్, జెడ్పీటీసీ పల్లె చంద్రయ్య,వైస్ ఎంపీపీ విక్రమ్‌రావు, ఉపాధ్యాయులు పుష్పలత,బండ శాంకరి,జ్యోతి, కృష్ణ గోపాల్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



భీమినిలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ కుమార్ దీపక్



మొక్కలు నాటుతున్న జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి



ముత్యంపల్లి పాఠశాలలో మొక్కలు నాటుతున్న అధికారులు

జిల్లాను అభివృద్ధి పథంలో నిలపాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 3: అధికార యంత్రాంగం సమష్టిగా కృషి చేసి జిల్లాను అభివృద్ధి పథంలో నిలపాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, ప్రత్యేక ఉప పాలన అధికారి చంద్రకళతో కలిసి సమావేశంనిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అన్ని రంగాల్లో ముందుండేలా అధికారులు కృషి చేయాలన్నారు. వివిధ శాఖల పరిధిలో కోర్టులలో పెండింగ్‌లో ఉన్న దావాల విష యంలో తీసు కునే చర్యలను వేగవంతం చేయాలని చెప్పారు. త్వరగా పరిష్కారానికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రిపోర్టు సమర్పించే సమయంలో ఎలాంటి ఒత్తిళ్లకు లోను కాకుండా సమగ్ర విచారణ జరిపి వాస్తవ నివేదికను అందించాలన్నారు. ఏమైనా పొర పాట్లు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రభుత్వ భూములు ఆక్రమించుకుని జరిపిన నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా వరద ముందపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలను అప్రమత్తం చేస్తూ పునరావాస ప్రాంతాలకు తరలించాలన్నారు. అమ్మఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరగా పూర్తిచే యాలన్నారు. పాఠశాలలు, వసతి గృహాలను తనిఖీలు చేసి విద్యార్థు ల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. మున్సిపల్, గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య నిర్వహణలో పనిచేసే ప్రైవేటు కార్మికులకు భీమా సౌకర్యం కల్పించాలన్నారు. బుధవారంతో ఎంపీపీల పదవీ కాలం పూర్తియినందున జిల్లాలోని 16 మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించామని చెప్పారు. వీరు మండలాల్లో పర్యటిం చి అభివృద్ధి, సమస్యలపై వారాంతనపు నివేదిక సమర్పించాలని ఆదేశిం చారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం బెల్లంపల్లిలోని వంద పడకల ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్,మార్చురీ గదులు, ఆసుపత్రి పరిసరాలను, వైద్యులు హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ వైద్యులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పోరేట్ ఆసుపత్రుల స్థాయి వైద్యం అందించాలని, రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. అనంతంర పట్టణం లోని సమీకృత కూరగాయల మార్కెట్ భవనాన్ని పరిశీలించి త్వరగా భవన నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్: విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో పఠన నైపుణ్యాలు పెంపొందించడం కోసం డీకోడబుల్ టెక్స్ ఉపయోగప డతాయని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో రూం టూ రీడ్ ఇండియా ట్రస్టు ఆధ్వర్యంలో రూపొందించిన డీకోడబుల్ టెక్స్ (విసంకేత పాఠ్యపుస్తకాలు), వికాసం, 1, 2 పుస్తకాలను డీఈవో యాదయ్య, ఏఎంవో సత్యనారాయణమూర్తి,రూం టూ రీడ్ ట్రస్టు సంస్థ రాష్ట్ర మేనేజర్ నరసింహాచారిలతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్లానింగ్ సమన్వయకర్త శ్రీనివాస్, సంస్థ రాష్ట్ర ప్రతినిధి ప్రవీణ్, ప్రాజెక్టు అధికారి నితిన్, మధు తదితరులు పాల్గొన్నారు.

భూమిలోకి వెళ్లకుండా అధికారులు అడ్డుకుంటున్నారని
వాటర్ ట్యాంకు ఎక్కి రైతు ఆందోళన

భీమారం, జూలై 3: తనకు భూమి పట్టాలు ఫారెస్టు అధికారులు తన భూమిలోకి వెళ్లకుం డా అడ్డుకుంటున్నారని బుధవారం మండల కేంద్రానికి చెందిన కోట శ్రీరాములు అనే రైతు ఇప్పల గూడ ప్రాంతంలోని వాటర్ ట్యాంకు ఎక్కాడు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ పోతనపల్లిశివారులోని సర్వే నంబరు 384లో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య ద్వారా ఐదు ఎకరాల భూమి పట్టాపత్రాన్ని పొందానని తెలిపాడు. నాటి నుంచి నేటి వరకు ఫారెస్టు అధికారులు తాను పోడు వ్యవసాయం చేసుకుంటుంటే అడ్డుకుంటున్నారని, అక్రమ కేసులు బనాయిస్తామని బెదిరిస్తున్నారని తెలిపాడు. విషయం తెలుసుకున్న ఫారెస్టు అధికారులు, పోలీసులు వాటర్ ట్యాంకు వద్దకు చేరుకుని శ్రీరాములుకు నచ్చజెప్పారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఫారెస్టు అధికారులు మాట్లాడుతూ ఫారెస్టు, రెవెన్యూ జాయింట్ సర్వే అనంతరం భూమి విషయం తేలుతుందని , అప్పటికి వరకు ఫారెస్టు భూమిలోకి రావద్దని సూచించామన్నారు. అనంతరం రైతు శ్రీరాములు కిందకు దిగి రావడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం శ్రీరాములును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పీఎస్సార్‌కు మంత్రి పదవి రావాలని ప్రత్యేక పూజలు

దండేపల్లి, జూలై 3: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని కాంగ్రెస్ శ్రేణులు గూడెం శ్రీసత్యనారాయణస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. లక్షెట్టిపేట చెందిన చింత అశోక్‌కుమార్ సువర్ణ దంపతులు బుధవారం లక్షెట్టిపేట నుంచి గూడెం గుట్ట శ్రీసత్యనారా యణస్వామి ఆలయం వరకు కాంగ్రెస్ పార్టీశ్రేణులతో కలిసి పాదయాత్ర చేపట్టారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రవీందర్‌రావు, రాజామౌళి, స్వామి, దేవా, రాజు, అమీర్‌ఖాన్, శ్రీకర్, సోను, ప్రశాంత్, నర్సింహచారి రాజేష్, జావిద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

హాజీపూర్, జూలై 3: రాపల్లి ఆర్అండ్ కాలనీలో హైమాస్ట్‌లైట్‌లను బుధవారం రాత్రి ఎంపీపీ మందపల్లి స్వర్ణలత ప్రారంభించారు. ఎంపీపీ నిధులు రూ. 8 లక్షల తో హైమాస్ట్‌లైట్లను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ప్రజలు రాత్రి వేళల్లో ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నా యకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అంతర పంటగా కంది సాగు చేయాలి

మందమర్రిరూరల్, జూలై 3: రైతులు పత్తి పంటలో అంతర పంటలో కంది పంటను సాగు చేయాలని దీని వల్ల అధిక లాభాలు పొందవచ్చని ఏఈవో ముత్యం తిరుపతి అన్నారు. బుధవారం వెంకటాపూర్, ఆదిల్‌పేట గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవో మాట్లాడుతూ పత్తి పంటలో కంది సాగు చేయడం వల్ల రైతుకు అదనంగా ఆదాయం వస్తుందని, భూసారం పెరుగుతుందన్నారు. ఏమైనా సందేహాలుంటే తమను సంప్రదించాలని సూచించారు.

కొండపోచమ్మకు మొక్కులు

బెల్లంపల్లి, జూలై 3: మండలంలోని బుగ్గ గుట్టపై వెలిసిన కొండపోచమ్మకు బుధవారం ఘనంగా బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బుగ్గ ఆలయ చైర్మన్ మాసాడి శ్రీదేవిశ్రీరాములు, ఆల య ధర్మకర్తలు వెంకటస్వామి, గోపి పాల్గొన్నారు.

గడువు తీరిన చెక్కు ఇచ్చిన అధికారులు

- తిరస్కరించిన బ్యాంక్ సిబ్బంది
- న్యాయం చేయాలని కుటుంబీకుల వినతి

కోటపల్లి, జూలై 3: మూడు నెలల క్రితం మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కును గడువు చివరి రోజు లబ్ధిదారురాలుకు తహసీల్దార్ కార్యాలయం అధికారులు అంద జేశారు. గడువు తీరిందని ఈ చె క్కు అక్కరకు రాదంటూ బ్యాంకు సిబ్బంది బుధవారం తిరస్కరిం చిన ఘటన కోటపల్లి మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెలితే.. మండలంలోని ఏదులబం దం గ్రామానికి చెందిన జైనేని సరి త -శ్రీనివాస్ దంపతుల కుమార్తె మేఘనకు వివాహం జరగగా కల్యాణలక్ష్మి పథకానికి తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పథకం కింద పెళ్లి కుమార్తె తల్లి జైనేని సరిత పేరుపై గత ఏప్రిల్ 3వ తేదీన రూ. 1.16 లక్షల చెక్కు మంజూరైంది. సదరు చెక్కును లబ్ధిదారులకు ఇవ్వడం మర్చిపోయిన అధికారులు కార్యాలయంలోనే పెట్టుకున్నారు. గడువ చివరి రోజైన బుధవారం రెవెన్యూ అధికారులు లబ్ధిదారు రాలుకు ఫోన్ చేశారు. కోటపల్లి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లానని తహసీల్దార్ తనకు మంజురైన చెక్కు ఇచ్చారని బాధితురాలు సరిత చెప్పింది. వెంటనే చెన్నూరు ఎస్‌బీఐ బ్యాంకుకు వెళ్లగా చెక్కు తీసుకున్న బ్యాంకర్లు దానిపై స్టాంపు వేశారని, అనంతరం గడువు తీరిందని ఈ చెక్కు చెల్లదని తనకు చేతిలో పెట్టారని సరిత వాపోయింది. తహసీల్దార్ కార్యాలయానికి గడిచిన రెండు నెలల్లో నాలుగైదు సార్లు వెళ్లి చెక్కు గురించి అడిగితే ఇంకా రాలేదని చెప్పిన అధికారులు గడువ చివరి రోజు తనకు చెక్కు అందించారని, దీంతో అంది చెల్లుబటు కాకుం డా పోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. పైగా దీనిపై తహసీల్దార్‌కు ఫోన్ చేస్తే ఆరు నెలల గడువు ఉంటుందని అన్నారని, కానీ బ్యాంకర్లు మూడు నెలలు గడువు ఉంటుందని తెలిపారని వాపోయింది. ఉన్నతాధి కారులు న్యాయం చేయాలని బాధితురాలు సరిత కోరింది.



చివరి రోజు అందజేసిన చెక్కు

సినిమా వార్తల కోసం www.andhrajyothy.comను క్లిక్ చేయండి

అధికారుల సహకారంతోనే అభివృద్ధి

జైపూర్, జూలై 3: అధికారులు, తోటి ప్రజాప్రతినిధుల సహకారం తోనే జైపూర్ మండలాన్ని అబివృద్ధి చేశామని ఎంపీపీ గోదారి రమాదేవి, జడ్పీటీసీ మేడి సునీత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో పదవీ వీడ్కోలు సన్మాన కార్యక్రమంలో వా రు మాట్లాడారు. మండలంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ సహకారంతో కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చి ఆయా గ్రామాల్లో అభివృద్ధి చేశామన్నారు. అధికారుల సహకారం లేకుంటే మండల అభివృద్ధి జరిగేది కాదని అన్నారు. అనంతరం జడ్పీ చైర్మన్ నల్లాల భాగ్యలక్ష్మి, ఎంపీడీవో సత్యనారాయణ ఎంపీపీ, జడ్పీటీసీ, వైస్ ఎంపీ పీ రమేష్, కో ఆప్షన్‌సభ్యుడు జైనుద్దీన్, ఎంపీటీసీలను సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు ఎంపీవో శ్రీపతి బాపురావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విద్యాసాగర్, ఈజీఎస్ ఏపీవో వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు లింగ స్వామి, అరికె స్వర్ణ, బోయిని స్వాతి, రాచర్ల సతీష్, బడుగు రవి తది తరులు పాల్గొన్నారు.

నెన్నెల: మండల పరిషత్ పాలక వర్గానికి బుధవారం అధికారులు ఘనం గా సన్మానించారు. ఎంపీపీ సంతోషం రమాప్రతాప్‌రెడ్డి, జడ్పీటీసీ సింగతి శ్యామలారాం చందర్, ఉపాధ్యక్షురాలు సుమలతతో పాటు ఎంపీటీసీలు బొమ్మెన హరీష్‌గౌడ్, పురంశెట్టి తిరుపతి, దాగం రమేష్, శిరీష, కమల, కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఇబ్రాహీంలకు పూల మాలలు వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, తహసిల్దార్ సబ్బ రమేష్, డిప్యూటీ తహసిల్దార్ ప్రకాష్, ఆర్‌ఐ గణేష్, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో నవీన్, ఎంపీఎం విజయలక్ష్మి, బెల్లంపల్లి, నెన్నెల ఏవోలు ప్రేమ్‌కుమార్, శ్రీకాంత్, పశు వైద్యాధికారి డాక్టర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

భీమిని: ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండలంలోని ఎంపీటీసీలకు, జడ్పీటీసీ లకు వీడ్కోలు సమావేశం నిర్వమించారు. ఎంపీపీ రాజేశ్వరి మాట్లాడుతూ మండల అబివృద్ధికి సహకరించిన అధికారులకు, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగమోహన్, ఎంపీపీ రాజేశ్వరి, జడ్పీటీసీ గంగక్క, వైస్ ఎంపీపీ మధు, ఎంపీటీసీ మమత, కోఆప్షన్ సభ్యుడు ఆరీఫ్, ఏపీఓ భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: మండల అభివృద్ధిలో భాగస్వాములుగా ఉన్నందుకు ఎంతో గర్వ పడుతున్నామని కాసిపేట ఎంపీపీ రొడ్డ లక్ష్మి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల పాలక మండలి వీడ్కోలు సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం అధికారులు, ప్రజా సంఘాల నాయకులు పాలకవర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పుస్కూరి విక్రమ్‌రావు, జెడ్పీటీసీ పల్లె చంద్రయ్య, ఎంపీటీసీలు నవనందుల చంద్రమౌళి, కొండబత్తుల రాంచందర్, స్వరూప, లక్ష్మి, మేరుగు పద్మ, మడావి భీంరావు, పర్వతి చిన్న మల్లేష్, కో ఆప్షన్ సభ్యుడు సిరాజ్ ఖాన్, ఎంపీ డీవో సత్యనారాయణసింగ్, ఎంపీవో నాగరాజు, స్థానిక నాయకులు శంకర్, వాసుదేవ్, రమేష్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ చేయాలి

బెల్లంపల్లి(తాండూర్), జూలై 3: వనమహోత్సవంలో భాగంగా ఇంటింటికీ నర్సరీల్లోని మొక్కలను పంపిణీ చేయాలని జిల్లా పంచా యతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచిం చారు. బుధవారం తాండూర్ మండలంలోని బోయపల్లి గ్రామంలో నర్సరీలను పరిశీలిం చారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు , సిబ్బంది ఉన్నారు.

'మాటిచ్చా.. సరస్వతి గుడిని నిర్మించా'

- 'ఆంధ్రజ్యోతి'తో సినీ గేయ రచయిత చంద్రబోస్
- ఆయన స్వగ్రామం చల్లగరిగలో 'ఆస్కార్ గ్రంథాలయం'


ఆస్కార్ గ్రంథాలయం

చిట్యాల, జూలై 3: ఆస్కార్ అవార్డు గ్రహీత, సినీ గేయ రచయిత కనుకుంట్ల చంద్రబోస్ తన గ్రామ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. తన స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగ గ్రామంలో సొంత నిధులతో ఆస్కార్ పేరిట ఓ గ్రంథాలయాన్ని నిర్మించారు. ఈ ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం జరగనుంది. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో బుధవారం ఫోన్‌లో మాట్లాడిన చంద్రబోస్.. 'గ్రామస్థులకు ఇచ్చిన మాట ప్రకారం సరస్వతి గుడిని నిర్మించా. చాలా సంతోషంగా ఉంది' అని ఆనందం వ్యక్తం చేశారు. చల్లగరిగలోని తమ ఇంటి పక్కన ఉన్న గ్రంథాలయంలో ఎన్నో సాహిత్య పుస్తకాలు చదివానని, వాటి వల్లే తాను ఉన్నత స్థాయికి ఎదిగానని ఈ సందర్భంగా చెప్పారు. ఆర్ఆర్ఆర్ సినిమాకు తాను రాసిన నాటునాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడంతో బాల్య మిత్రులు, గ్రామ ప్రజలు తనని సన్మానించారని చెప్పారు. ఆ సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతూ గ్రామంలో అత్యాధునిక హంగులతో గ్రంథాలయ భవనం నిర్మిస్తానని ఇచ్చిన మాటను ఈ రోజున నిలబెట్టుకున్నానని వివరించారు. అందరి సహకారంతో రూ. 36లక్షల వ్యయంతో ఎనిమిది నెలల్లో భవనాన్ని సిద్ధం చేసి ఆస్కార్ గ్రంథాలయం అని నామకరణం చేశామని చెప్పారు. కాగా, రచయిత చంద్రబోస్ తన సొంత నిధులతో నిర్మించిన ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని గ్రంథాలయాల జిల్లా కార్యదర్శి శ్రీలత తెలిపారు.

ఇద్దరు రైతుల ఉసురు తీసిన అప్పులు

పెంబి రూరల్, బొంరాస్‌పేట్, జూలై 3: పంటల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. నిర్మల్ జిల్లా పెంబి మండలం యాపల్‌గూడ గ్రామానికి చెందిన రైతు అర్క సంతోష్ (28) తనకున్న ఎకరంతో పాటు నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట వేశాడు. ఇందుకోసం రూ.లక్షల్లో అప్పు చేశాడు. పత్తి విత్తనా లు మొలకెత్తకపోవడంతో పాటు చేసిన అప్పులు తీర్చాలని బాకీలు ఇచ్చిన వారు వేధించడంతో మనస్తాపానికి గురై మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ జిల్లా మెట్లకుంట గ్రామానికి చెందిన బైరం నర్సింహులు(62)కు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వారి వివాహాల కోసం చేసిన అప్పులు తీర్చేందుకు తనకు ఉన్న రెండు ఎకరాల పొలంలో ఎకరన్న సీలింగ్ భూమిని అమ్మకానికి పెట్టగా కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో బుధవారం ఉరేసుకున్నాడు.

ఉస్మానియా ఆస్పత్రిలో విద్యుత్ అంతరాయం

- టార్చ్‌లైట్ల వెలుగులో శస్త్రచికిత్సలు

మంగళ్‌హాట్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో బుధవారం మధ్యాహ్నం విద్యుత్ నిలిచిపోవడంతో రోగులు, వైద్యులు ఉక్కిరిబిక్కిరయ్యారు. శస్త్రచికిత్సలు చేసే సమయంలో అంతరాయం కలగడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ నిలిచిన వెంటనే ప్రారంభం కావాల్సిన జనరేటర్లు సైతం మొరాయించాయి. సిబ్బంది వెంటనే విద్యుత్ విభాగం నిపుణులను రప్పించి అరగంట తర్వాత సేవలను పునరుద్ధరించారు. దీంతో అప్పటివరకు సెల్‌ఫోన్, టార్చ్‌లైట్ల వెలుతురులోనే శస్త్రచికిత్సలను కొనసాగించినట్లు సమాచారం.

'జికా'..వస్తోంది జాగ్రత్త

రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం.. మహారాష్ట్రలో పెరుగుతున్న కేసులతో ఆందోళన

- సంసిద్ధంగాలేని తెలంగాణ వైద్యశాఖ
- కనీస చర్యలూ తీసుకోని వైనం
- ఇప్పటికే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల విజృంభణ



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలో జికా వైరస్ విజృంభిస్తోంది. రెండు రోజుల క్రితం పుణెలో ఒక్క రోజే ఆరు జికా వైరస్ వ్యాధి (జడ్‌వీడీ) కేసులు నమోదుకావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దీంతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం బుధవారం అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈమేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) డాక్టర్ అతుల్‌గోయల్ అడ్వైయిజరీ జారీ చేశారు. జికాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా గర్భిణులను స్ర్కీనింగ్ చేయాలని కేంద్రం కోరింది. జికా వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన గర్భిణుల్లో పిండం ఎదుగుదలను పర్యవేక్షించాలని సూచించింది. ప్రతి ఆస్పత్రిలో కచ్చితంగా ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని, ఆ అధికారి జికా వైరస్ వ్యాప్తికి కారణమయ్యే దోమల పెరుగుదల నివారణకు చర్యలు చేపట్టాలని కోరింది. జికా కేసులు నమోదైతే వెంటనే నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీవీబీడీసీ)కు రిపోర్టు చేయాలని, అనుమానిత నమూనాలను పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపాలని సూచించింది. అలాగే ఐసీఎంఆర్ ఆధ్వర్యంలోని వైరస్ పరిశోధనా కేంద్రాలకు కూడా శాంపిళ్లను పంపాలని ఆదేశించింది.

అప్రమత్తంగాలేని రాష్ట్ర వైద్యశాఖ..

మహారాష్ట్ర నుంచి తెలంగాణకు రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి మహమ్మారులు వచ్చినప్పుడు వాటిని నియంత్రించే బాధ్యత క్షేత్రస్థాయిలో ప్రజారోగ్య సంచాలకులకే ఉంటుంది. అయితే మన వద్ద ఇంతవరకు అందుకు సంబంధించిన కార్యాచరణేమీ కానరావడంలేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఒకవైపు డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల విజృంభణ మొదలైంది. గత ఐదు నెలల్లో మలేరియా, డెంగ్యూ మరణాలు కూడా సంభవించాయి. పటిష్ఠ పర్యవేక్షణ లేకపోవడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో వీటిపై అవగాహన ఉన్న విభాగాధిపతి లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని వైద్యవర్గాలు చెబుతున్నాయి. అందుకే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దోమల ద్వారా వ్యాప్తి..

జికా వైరస్ అనేది దోమల ద్వారా సంక్రమించే ఫ్లేవి వైరస్. జికా ప్రధానంగా ఏడెస్ దోమల కాటు ద్వారా వ్యాపిస్తుంది. ఇదే దోమ కుడితే డెంగ్యూ, చికున్‌గున్యా, ఎల్లో ఫీవర్ వైరస్‌లు కూడా సోకుతాయి. జికా సోకితే సాధారణ లక్షణాలే ఉంటాయి. ఇవి 2-7 రోజులపాటు కనిపిస్తాయి. ముఖ్యంగా జ్వరం, దద్దుర్లు, కీళ్ల నొప్పి, కండ్లకలక (ఎరుపు కళ్లు), కండరాలు, తలనొప్పితో పాటు మరికొన్ని తీవ్రమైన సమస్యలు కలుగుతాయి. మైక్రోసెఫాలీ (పుట్టుక లోపం), గులియన్ బారే సిండ్రోమ్ (న్యూరోలాజికల్ డిజార్డర్), మెనింజైటిస్ (మెదడు, వెన్నెముక లైనింగ్ వాపు)లాంటి వాటికి కారణమౌతుంది.

నివారణ ఎలాగంటే..

దోమల వృద్ధిని నివారించడానికి ఇళ్లు, బహిరంగ ప్రదేశాల చుట్టూ నిలిచిన నీటిని తొలగించాలి. జికా కూడా లైంగికంగా సంక్రమించే అవకాశం ఉన్నందున సురక్షితమైన విధానాలను పాటించాలి. జికాకు నిర్దిష్ట చికిత్స లేదు, కానీ లక్షణాల ఆధారంగా చికిత్సను అందిస్తారు. జికా లక్షణాలు కనిపిస్తే వెంటనే సరైన రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని డాక్టర్‌ను సంప్రదించాలి.

పిడుగుపాటు కాదు..అంతర్గత లోపమే

- 'భద్రాద్రి పవర్ ప్లాంట్' ప్రమాదంపై తేల్చిన జెన్‌కో..

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ప్రమాదానికి అంతర్గత లోపాలే కారణమని తేలింది. పిడుగుపాటు వల్ల ప్రమాదం జరగలేదని జెన్‌కో స్పష్టం చేసింది. భద్రాద్రి పవర్ ప్లాంట్ ఒక్కోటి 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు (1080 మెగావాట్లు) ఉండగా.. అందులో 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్-1లోని జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ గత శనివారం అగ్నిప్రమాదం జరిగి కాలిపోయింది. దీనికి పిడుగుపాటే కారణమని తొలుత ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ జెన్‌కో అధికారులతో విచారణ జరిపించారు. పిడుగు పడిన సమయంలోనే యాదృచ్ఛికంగా జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ అంతర్గత లోపాలతో, దాని లోపల మంటలు ఉత్పన్నమయ్యాయని, ఇందుకు బాహ్య కారణాలు లేవని తేల్చారు. దీనిపై ప్రభుత్వానికి జెన్‌కో తాజాగా నివేదిక సమర్పించింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఓ వ్యవస్థ దెబ్బతిని.. ఆయిల్ లీకేజీ జరిగి పూర్తిగా దగ్ధమైందని అందులో అధికారులు వివరించారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ. 30 కోట్లకు పైగా నష్టం జరిగినట్లు ఇప్పటికే ఓ నిర్ధారణకు వచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను పూర్తిగా విప్పి పరిశీలించిన తర్వాత నష్టంపై పూర్తి స్పష్టత రానుందని ప్రభుత్వానికి జెన్‌కో నివేదించింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో అంతర్గత లోపాలకు నిర్మాణ, నిర్వహణ, పర్యవేక్షణ లోపాలు కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు.

కుటుంబాన్ని మింగేసిన మద్యం రాకాసి

- మద్యానికి బానిసైన భర్త వేధింపులు తాళలేక..
- ముగ్గురు కుమార్తెలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ తల్లీ, ఓ కూతురు మృతి


అనిత (ఫైల్)


రమ్య (ఫైల్)

కాగజ్‌నగర్, జూలై 3: ఐదుగురు ఆడపిల్లల తండ్రి బాధ్యతలు మరచి మద్యానికి బానిసై వేధింపులకు గురి చేస్తుండడంతో జీవితంపై విరక్తి చెంది అతని భార్యాబిడ్డలు ఆత్మహత్యకు యత్నించారు. భార్య, ఓ కుమార్తె మరణించగా మరో ఇద్దరు కూతుళ్ల పరిస్థితి విషమంగా ఉంది. కుమరం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలం గజ్జిగూడకు చెందిన ఓ కుటుంబాన్ని మద్యం మింగేసింది. గజ్జిగూడకు చెందిన ప్రతాప్‌కు భార్య అనిత(55), ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కూతురికి వివాహమవ్వగా లక్ష్మి(21), రవళి(18), రమ్య(16), ఐశ్వర్య(14) చదువుకుంటున్నారు. మద్యానికి బానిసైన ప్రతాప్ తాగిన మైకంలో గ్రామస్థులతో నిత్యం గొడవలు పడుతుండేవాడు. ఆర్థిక ఇబ్బందులతో తమకున్న వ్యవసాయ భూమిలో కొంత భాగాన్ని అమ్మేశాడు. మిగిలిన కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ అనిత కుటుంబాన్ని పోషించేది. 15 రోజుల క్రితం పొలం వద్ద జరిగిన గొడవలో ప్రతాప్ ఓ వ్యక్తిపై గొడ్డలితో దాడి చేశాడు. హత్యాయత్నం కేసులో ప్రతాప్ జైలుకెళ్లాడు. గ్రామ ప్రజల సాయంతో ప్రతాప్‌కు బెయిల్ ఇప్పించిన అనిత భర్తను జైలు నుంచి బయటకు తీసుకొచ్చింది. ప్రతాప్ తీరుమారకపోవడంతో మద్యం మానేయాలంటూ అనిత సోమవారం గొడవపడింది. ఇందుకు ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రతాప్ భార్య అనితపై దాడి చేసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అనిత.. కుమార్తెలు రమ్య, లక్ష్మి, ఐశ్వర్య, రవళితో కలిసి పొలానికి వెళ్లి ఆత్మహత్య చేసుకుందామని చెప్పింది. రవళి మినహా తల్లీకూతుళ్లు అందరూ పురుగు మందు తాగేశారు. రవళి కేకలు విని అక్కడికి వచ్చిన చుట్టుపక్కల పొలాల్లోని వారు అనిత, ఆమె కుమార్తెలను ఆస్పత్రికి తరలించారు. అయితే, రెండ్రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనిత, రమ్య బుధవారం మృతి చెందారు. లక్ష్మి, ఐశ్వర్య పరిస్థితి విషమంగా ఉంది. మరోపక్క, ప్రతాప్‌ను పోలీసులు అరెస్టు చేశారు.


సిద్దిపేట జిల్లా రాయపోల్‌లో గుర్తించిన సిడితల వీరగల్లు

తల నరుక్కొంటే.. శివ సన్నిధికి చేరుకుంటామని..

- చాళుక్యులు, రాష్ట్రకూటుల కాలంలో శైవుల్లో ఈ విశ్వాసం
- 'సిరితల వీరగల్లు'గా ప్రశస్తి.. సిద్దిపేట జిల్లా రాయల్‌పోల్‌లో విగ్రహం లభ్యం

రాయపోల్, జూలై 3: ప్రాణార్పన చేస్తే దేవుడి సన్నిధికి చేరుకుంటామని నమ్మడం.. ఓ పదునైన ఆయుధంతో తమ తలను తామే నరుక్కోవడమో.. మరొకరితో నరికించుకోవడమో చేయడం గురించి విన్నారా? 6వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం వరకు నడిచిన చాళుక్యుల కాలంలో, అప్పట్లోనే రాష్ట్రకూటుల హయాంలో శైవభక్తుల్లో ఈ విశ్వాసం ఉండేదట! భాసింపట్టు వేసుకున్న స్థితిలో తలపైన ఉన్న జుట్టు సాయంతో తాటిచెట్టుకో.. వెదురు చెట్టుకో వేలాడుతున్న వ్యక్తితో ఉన్న ఆ శిల్పాన్ని చూస్తున్నారా? ఆ వ్యక్తి చేతులు ముకుళితమై ఉన్నాయి. తల నుంచి మొండెం వేరయినట్లుగా మధ్యలో గ్యాప్‌ను స్పష్టంగా గమనించొచ్చు! ఈ శిల్పాన్ని 'సిడితల వీరగల్లు' అంటారు. శైవభక్తులు ఆత్మబలిదానాలను ధర్మకార్యంగా భావించేవారు. శివసన్నిధికి చేర్చే తక్షణ మార్గంగా ఆత్మబలిదానాలను ఎంచుకునేవారు. పైగా తల నరుక్కొని మరణిస్తే, తమ ప్రాణాలను తీసుకెళ్లేందుకు దేవాంగనలు వస్తారని విశ్వసించేవారు. ఈ శిల్పంలో.. పైన ఇద్దరు మహిళలుండటాన్ని గమనించవచ్చు! ఫొటోలో కనిపిస్తున్న ఈ 'సిడితల వీరగల్లు' సిద్దిపేట జిల్లా రాయపోల్‌లోని పురాతన గణపతి ఆలయం ప్రాంగణంలోనిది. దీన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ గుర్తించి.. వివరించారు. మహిళా సిడితల వీరగల్లులు జనగామ జిల్లా లింగపల్లిలో లభించాయి. పురుష సిడితల వీరగల్లులు ఇప్పటిదాకా యాదాద్రి జిల్లా చొల్లేరులో, వనపర్తి జిల్లా కేంద్రంలో లభించగా రాయపోల్‌లోనిది మూడోది. ఇక సిడితల వీరగల్లులు కాకుండా కేవలం వీరగల్లులూ ఉంటాయి. తోటి ప్రజలను, పాడిపశువులను కాపాడే క్రమంలో అడవి జంతువులతో పోరాడి చనిపోతే, యుద్ధాల్లో పాల్గొని ప్రాణాలు కోల్పోతే వారిని వీరగల్లుగా చెక్కి ప్రజలు ఆరాధించేవారు.

పెంటారెడ్డి పదవీకాలం ఆర్నెల్లు పొడిగింపు

నీటిపారుదలశాఖలో ఎత్తిపోతల పథకాల సలహాదారుడు కె.పెంటారెడ్డి పదవీ కాలాన్ని మరో ఆర్నెల్ల పాటు పొడిగిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెంటారెడ్డి పదవీకాలం పొడిగింపు నిర్ణయం మే 16 నుంచి ఆరునెలల పాటు అమలులో ఉండనుంది.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన మోడల్‌స్కూల్ విద్యార్థినులు


తిరోజ మనస్విని భావన

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 3: జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులు బాసర ట్రిపుల్‌ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఖలీల్ తెలిపారు. బుధ వారం ఆర్‌జీయూకేటీ విడుదల చేసిన ఎంపిక జాబితాలో మోడల్‌స్కూల్‌కు చెందిన సోనులె తిరోజ, మసాదే మనస్విని, గుండెటి భావన ఎంపికైనట్లు తెలిపారు. ముగ్గురు విద్యార్థులు ఈ ఏడాది పదవతరగతిలో 9.8జీపీఏతో ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

అరిగెల సోదరులకు ఘన సన్మానం


జడ్పీటీసీ, ఎంపీపీలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 3: జిల్లాకేంద్రంలోని జన్కాపూర్ జడ్పీఉన్నత పాఠశాలలో బుధవారం జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్‌ను ప్రధానోపాధ్యాయుడు ఉదయ్‌బాబు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. వారి పదవీకాలం పూర్తికానున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారిసేవలను కొనియాడారు. అలాగే బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు కిషన్‌రావు, ప్రకాష్,రవీందర్‌కు వీడ్కోలు పలికి, బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు విజేష్, స్వప్న, భారతి, ప్రవీణ్‌కు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మయ్య, ఉమాబాల, మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, రాజేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

యువకుల శ్రమదానం

బెజ్జూరు, జూలై 3: మండలకేంద్రంలోని గోల్కొండ కాలనీలో ఇటీవల కురిసిన వర్షానికి నీరు నిలువఉండి బురదగా మారడంతో రాకపోకలకు తీవ్రఇబ్బంది ఏర్పడింది. దీనిని గమనించిన యువ కులు రెండు ట్రాక్టర్లతో మొరం వేయించి శ్రమదానం చేశారు. కార్యక్రమంలో యువకులు శ్రీకాంత్, షాకీర్ హుస్సేన్, మోయిన్‌ఖాన్, జాహీద్‌ఖాన్, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్సు పాసుల పంపిణీ

చింతలమానేపల్లి, జూలై 3: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ప్రసాద్ అధ్యక్షతన దివ్యాంగులకు రాయితీపై బస్సు పాసుల మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన 31 మంది దివ్యాంగుల నుంచి దరఖాస్తులు సేకరించారు. కార్యక్రమంలో ఏపీఎం తిరుపతి, వికలాంగుల సంఘం అధ్యక్షుడు రవిశంకర్, ఆర్టీసీసిబ్బంది తులసీరాం,పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కౌటాల/చింతలమానేపల్లి/సిర్పూర్(యు), జూలై 3: సైబర్‌నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సైలు మధుకర్, నరేష్, మాధవ్‌గౌడ్ అన్నారు. బుధవారం వారు కౌటాల, చింతలమానేపల్లి, సిర్పూర్(యు)లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక డబ్బు, గిఫ్ట్ లాంటి ఆశలు చూపి మనల్ని తప్పుతో పట్టించేందుకు సైబర్ నేరగాళ్లు మోసపూరిత కాల్స్ చేస్తున్నారని వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫోన్‌లో వచ్చిన ఓటీపీ కానీ, ఆధార్‌కార్డు నెంబర్లు కానీ, ఏటీఎం పిన్ నెంబర్లు కానీ ఏవీ కూడా ఇతరులకు చెప్పకూడదని అన్నారు.

ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం



చింతలమానేపల్లి, బెజ్జూరులలో సన్మానం పొందిన ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీలు

పలు మండలాల్లో బుధవారం ఎంపీపీ, జడ్పీటీసీలకు సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. వారంతా తమ ఐదేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా వారు చేసిన సేవలను కొనియాడి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఐదేళ్లు తమ పాలనకాలం సంతృప్తినిచ్చినట్లు పేర్కొన్నారు. సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

చింతలమానేపల్లి, జూలై 3: మండలంలోని ఎంపీటీసీలు, జడ్పీటీసీల పదవీకాలం పూర్తైన సందర్భంగా ఎంపీడీవో ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కోఆప్షన్‌సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీటీ ముష్కార్ అలీ, జడ్పీటీసీ శ్రీదేవి, వైస్ ఎంపీపీ మనోజిత్, కోఆప్షన్‌నాజీం హుస్సేన్, నాయకులు పాల్గొన్నారు.

సేవలు సంతృప్తినిచ్చాయి..

బెజ్జూరు: అయిదేళ్లపాటు ప్రజాసేవలో చేపట్టిన సేవలు సంతృప్తినిచ్చాయని ఎంపీపీ రోజా రమణి, జడ్పీటీసీ పుష్పలత అన్నారు. బుధవారం రైతుల వేదికలో ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడుతూ తమపై నమ్మకాన్ని పెట్టుకొని గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏవో రాజులనాయుడు, ఎంఈవో రమేష్‌బాబు ప్రజాప్రతినిధులు చేపట్టిన అభివృద్ధిని కొనియాడారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ జ్యోతి, ఎంపీటీసీలు శ్రీనివాస్, వెంకన్న, సాయన్న, పర్వీన్ సుల్తానా, కోఆప్షన్ సభ్యుడు బషరత్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సేవలు మరువలేనివి..

సిర్పూర్(టి): ఎంపీటీసీల సేవలు మరువలేనివని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. ఎంపీటీసీల పదవీకాలం ముగియడంతో బుధవారం వారికి ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయిదు సంవత్సరాలుగా వారు అందించిన సేవలు మరువలే నివని అన్నారు. ఎంపీటీసీలు మాట్లాడుతూ తాము పదవిలో లేకపోయినా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తామన్నారు. అనంతరం ఎంపీడీవో, సిబ్బంది వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈర్ల సత్యనారాయణ, ఎంపీటీసీలు సోహెల్ అహ్మద్, తుకారాం, మంగిలాల్, అధికారులు పాల్గొన్నారు.

జిల్లాకే ఆదర్శం కౌటాల: డీఆర్డీవో

కౌటాల: జిల్లాకు ఆదర్శంగా కౌటాల మండలం నిలుస్తుందని డీఆర్డీవో సురేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జగదాంబ ఫంక్షన్ హాల్‌లో కౌటాల ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలకు ఏర్పాటు చేసిన సన్మానంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంత మారుమూల ప్రాంతం అయినప్పటికీ ప్రజాప్రతినిధుల కృషి, అధికారుల సహకారంతో మండలం అన్నిరంగాల్లో ముందుందన్నారు. అనంతరం ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, కోఆప్షన్ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్ర మంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ దేవయ్య, డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మాంతయ్య,డీఎల్‌పీఓ ఖమర్‌హుస్సెన్, ఎంపీడీవో నస్రుల్లాఖాన్, తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి చేశాం..

మండలంలో ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారుల సహకారంతో అభివృద్ధి చేశామని ఎంపీపీ విశ్వనాథ్ అన్నారు. బుధవారం ఆయన అధ్యక్షతన మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అయిదు సంవత్సరాలుగా మండల అధికారులందరు ప్రత్యక్షంగా, పరోక్షంగా అన్నివిధాల అభివృద్ధికి సహకరించాన్నారు.

ఎంపీపీ, వైస్‌ఎంపీపీలకు సన్మానం..

కెరమెరి: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు ఎంపీపీ మోతీరాం, జడ్పీటీసీ ద్రుపతాబాయి, వైస్‌ఎంపీపీ కలాంను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోతీరాం, వైస్‌ఎంపీపీ కలాం, జడ్పీటీసీ ద్రుపతాబాయితోపాటు ఎంపీడీవో అంజద్‌పాషా, కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నడిచి వెళ్లేదెలా?

పెంచికలపేట, జూలై 3: మండలంలోని గుంట్లపేట గ్రామంలో డ్రైయినేజీ వ్యవస్థ సరిగ్గా లేక వీధులన్నీ మురికి కాలువగా మారుతున్నాయి. గ్రామంలో ప్రధానకూడలి, అంజనేయస్వామి ఆలయసమీపంలో సరైన డ్రైయినేజీ వ్యవస్థ లేక వర్షపు నీరు రోడ్డుపై నిలిచి ప్రజలు నడవడానికి కూడా వీలు లేకుండా ఉంది. వాహనదారులు సైతం అదుపుతప్పి కిందపడి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు నానా తంటాలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షపునీరు, మురుగునీరు రోడ్డుపై చేరకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


దారిపై నిలిచిన మురుగునీరు

చేతి పంపు ఇలా.. నీరు తెచ్చేది ఎలా?


సీసీ రోడ్డు కింద ఉన్న చేతి పంపు

దహెగాం, జూలై 3: చేతిపంపు సీసీ రోడ్డు కంటే కిందికి ఉండడంతో నీటిని తెచ్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని కోయవాగు గ్రామప్రజలు వాపోతున్నారు. అధికారుల పాలనలో సమస్యలు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మిషన్ భగీరథ నీరు ఏనాడు చూడలేదని ఉన్న చేతి పంపునైనా నీరు తెచ్చుకోవ డానికి వీలుగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

6న సబ్‌జూనియర్ బాలికల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

ఆసిఫాబాద్ రూరల్, జూలై 3: సబ్‌జూనియర్ బాలికల అండర్-13ఫుట్‌బాల్ ఉమ్మడిజిల్లా జట్టు ఎంపిక పోటీలు ఈనెల6న నిర్వహిస్తామని ఫుటల్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థుల పేర్లను కోచ్‌రవి, ప్రిన్సిపాల్ అనితకు రిపోర్టు చేయాలన్నారు.

జిల్లాలో 16.3మిల్లీమీటర్ల వర్షపాతం

ఆసిఫాబాద్, జూలై 3:జిల్లాలో బుధవారం 16.3మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. వాంకిడిలో 38.4మిల్లీమీటర్లు, పెంచికలపేటలో 25.8, సిర్పూర్(యు)లో 25.4, బెజ్జూరులో 23, దహెగాంలో 22.6, కాగజ్ నగర్‌లో 21.4, జైనూరులో 16.2, ఆసిఫాబాద్‌లో 14.2, కౌటాల, చింతలమానేపల్లిలో 13.2, కెరమెరిలో 10.2, సిర్పూర్(టి)లో 10, లింగాపూర్‌లో 5.2, రెబ్బెనలో5, తిర్యాణిలో1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

దివ్యాంగులకు పెన్షన్ పెంచాలి

ఆసిఫాబాద్, జూలై 3: దివ్యాంగులకు పెన్షన్ పెంచాలని వికలాంగులహక్కుల జాతీయవేదిక ఆధ్వర్యంలో బుధవారం దివ్యాంగులు కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం దివ్యాంగులకు రూ.6వేల పెన్షన్ అమలు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్, కార్యదర్శి ఆనంద్‌కుమార్, జాకీర్, సప్తగిరి, లక్ష్మిరాజు, కళ్యాణ్ పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారి నియామకం

కెరమెరి, జూలై 3: మండల ప్రత్యేకాధికారిగా ఆర్ లక్ష్మి నారాయణ నియమితులైనట్లు ఎంపీడీవో అంజద్‌పాషా తెలిపారు. ఆయన జిల్లాపరిషత్ డిప్యూటీ డీఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ మేరకు కలెక్టర్ నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు తెలిపారు.

ఉద్యోగులకు పదవీ విరమణ సహజం

జైనూర్, జూలై 3: ప్రభుత్వఉద్యోగులకు పదవీ విరమణ, బదిలీలుసహజమని ఏటీడీవో పురుషోత్తం అన్నారు. మండలంలోని మర్లవాయి ఆశ్రమోన్నత పాఠశాలలో వంట మనిషిగా విధులు నిర్వర్తిస్తున్న అనసూయబాయి బుధవారం పదవివిరమణ పొందడంతో గ్రామస్థులు, ఆశ్రమోన్నతపాఠశాల సిబ్బంది సన్మానించారు. తాజామాజీ సర్పంచ్ కనకప్రతిభ, కనకవెంకటేష్ పాల్గొన్నారు.

పాఠశాల ముందున్న టేలాలను తొలగించాలి

సిర్పూర్(యు), జూలై 3: మండలకేంద్రంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎదుట ఉన్న టేలాలను తొలగించాలని ప్రధానోపాధ్యాయుడు కొత్తూరి ఆంధ్రయ్య కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాల ఎదుట టేలాల్లో గుట్కాలు, సిగరేట్లు విక్రయిస్తున్నారన్నారు. గుటుచప్పుడుకాకుండా మద్యం విక్రయిస్తున్నారన్నారు. పాఠశాలప్రహరీకి ఆనుకొని టేలాలు ఉండడంతో పాఠశాల కనిపించటం లేదన్నారు. టేలాల్లోని చెత్తచెదారం పాఠశాలలోనే వేస్తున్నారన్నారు. ఈవిషయమై తహసీల్దార్, ఎస్సైకిఫిర్యాదు చేశామన్నారు. అయినప్పటికీ ఇంత వరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇక జిల్లాకలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు.

గేదెల వేలం

చింతలమానేపల్లి, జూలై 3: దిందా గ్రామ బంజరు దొడ్డిలో ఏడు రోజులుగా ఉన్న అయిదు గేదెలకు గురువారం వేలం వేస్తామని కార్యదర్శి మధుకర్ తెలిపారు.

- పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు
- కలుషిత నీరు, పారిశుధ్య లోపం, డ్రెయినేజీలే ప్రధాన కారణాలు
- అప్రమత్తంగా లేకుంటే అనర్థమే

వర్షాకాలం జరభద్రం

వర్షాలు మొదలయ్యాయి. కలుషిత నీరుతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ప్రజలు అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉంది. ఏటా వర్షాకాలం ప్రారంభంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తూనే ఉన్నాయి. మలేరియా, డయేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, తదితర సీజనల్ వ్యాధులతో ఏటా జిల్లావాసులు విలవిలలాడుతున్నారు. కలుషిత నీరు, డ్రెయినేజీ, పారిశుధ్యలోపం ఇందుకు ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. - ఆసిఫాబాద్



ఆసిఫాబాద్ పట్టణంలోని పైకాజీనగర్ కాలనీలో ఇళ్ల మధ్యన నిలిచిన మురుగు నీరు

వ్యాధులపరంగా జిల్లా.. ఉమ్మడి జిల్లాలోనే సమస్యాత్మక గిరిజన ప్రాంతం. ప్రతివర్షాకాలంలో వ్యాధులు ప్రబలుతూ ప్రజలు రోగాల బారినపడుతుంటారు. కొన్ని సందర్భాల్లో మృత్యువాత పడిన సంఘటనలు సైతం లేకపోలేదు. జిల్లాలో ప్రతియేటా డయేరియా(అతిసారా), మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా వంటి వ్యాధుల బారిన పడి గిరిజనులు అల్లాడిపోతుంటారు. ముఖ్యంగా ఆసిఫాబాద్, కెరమెరి, జైనూర్, సిర్పూర్ (యు), లింగాపూర్, తిర్యాణి, బెజ్జూరు, చింతలమానేపల్లి మండలాల్లోని గిరిజన ప్రాంతాల్లోనే అంటువ్యాధుల సమస్య అధికంగా ఉంటుంది. దీనికి తోడు ఇక్కడి నీటి వనరులు కూడా అంటువ్యాధులు ప్రబలేందుకు కారణమవుతున్నాయి. గిరిజన గ్రామాల్లో ఇప్పటికీ కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల ప్రజలు వాగులు, వంకలపైనే ఆధారపడి తాగునీటి అవసరాలను తీర్చుకుంటున్నారు. జిల్లాలో రక్షిత మంచి నీటి పథకాలు ఏర్పాటు చేసినా ఇందులో చాలావరకు పథకాలు పని చేయడం లేదు.

అలాగే శానిటేషన్ కూడా అంతంత మాత్రంగా ఉండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలడానికి కారణమవుతున్నాయి. గిరిజన గ్రామాల్లో డ్రైనేజీ లేకపోవడంతో మురుగునీరు ఇంటి ఆవరణలోనే నిలువ ఉండడం, దోమలు వృద్ధి చెందడంతో పాటు మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడం తదితర అంశాలు వ్యాధులు ప్రబలేందుకు ప్రధాన కారణాలవుతున్నాయి. అంటువ్యాధులు ప్రబలిన తరువాత హడావుడి చేసే అధికార యంత్రాంగం ముందస్తు నియంత్రణ చర్యలు చేపడితే కొంత ప్రయోజనం ఉంటుందనేది ప్రజల అభిప్రాయం. నీటివనరులను క్లోరినేషన్ చేయడంతోపాటు డ్రైనేజీ వ్యవస్థను శుభ్రం చేసి బ్లీచింగ్ చేస్తే కొంత అంటు వ్యాధులను అరికట్టే వీలుంటుంది.

వైద్యుల కొరత..



ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి

జిల్లాలోని 15మండలాల్లో మొత్తం రెండు సామాజిక ఆసుపత్రులు, రెండు పట్టణ ఆరోగ్యకేంద్రాలు, 20ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, 118ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలో 46 మంది వైద్యుల పోస్టులకుగాను కేవలం 20మంది విధులు నిర్వహిస్తుండగా 26వైద్య పోస్టులు ఖాళీగా ఉన్నాయి, స్టాఫ్‌నర్సులు, ఫార్మసిస్టులు, హెల్త్ సూపర్‌వైజర్‌లు, ల్యాబ్ టెక్నీషియన్‌లు, ఏఎన్ఎం ఇతర సిబ్బంది మొత్తం 481పోస్టులకుగాను 336 మంది పని చేస్తున్నారు.145పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో జిల్లాలో పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందడం లేదు. దీనికి తోడు జిల్లాలో 300కి పైగా గిరిజన గూడాలు అత్యంత సమస్యాత్మక ప్రాంతాలుగా ఉండడం, ఆయా గ్రామాలకు కనీసం కాలినడకన కూడా వెళ్లే పరిస్థితి లేకపోవడం, వర్షాకాలంలో వాగులు, వంకలు దాటుకుంటూ అక్కడి చేరుకోవడం వైద్య సిబ్బందికి సవాలుగా మారింది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఈ సీజన్‌లో టైఫాయిడ్, మలేరియా, డయేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వాటినుంచి బయటపడాలంటే వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలి. వర్షం నీరు, మురికినీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. కాచి చల్లార్చిన నీరు తాగడం శ్రేయస్కరం. నిలువ ఉంచిన ఆహారపదార్థాలను తినకుండా ఉంటే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. వేడిపదార్థాలు తీసుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.

అప్రమత్తంగా ఉన్నాం..

డాక్టర్ సుధాకర్ నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో



సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం వైద్యఆరోగ్య శాఖ పూర్తి అప్రమత్తంగా ఉంది. ఎప్పటికప్పుడు సిబ్బందితో సమావేశాలను నిర్వహిస్తూ సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రణాళికలను రూపొందిస్తున్నాం. ఏజెన్సీ ప్రాంతాల్లోని వైద్యసిబ్బందిని మరింత అప్రమత్తం చేశాం. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయి.

ప్రజా ఆదరణను చేసి ఓర్వలేకనే ఆరోపణలు

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ రూరల్, జూలై 3: నియోజకవర్గంలో తనకున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు కక్షపూరితంగా తన అనుచరగణంపై బెదరింపులకు దిగడంతోపాటు కేసులు పెడుతున్నారని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ధ్వజమెత్తారు. బుధవారం ఆమె తన నివాసంలో ఆదివాసీ, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరులసమావేశంలో మాట్లాడారు. ఆదివాసీ మహిళ అయిన తనపై కాంగ్రెస్ నాయకుల పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. ఆదివాసీ నాయకురాలు అయిన ఆత్రం సుగుణను అడ్డుపెటుకొని తనపై ఆరోపణలు, దిష్టిబొమ్మదహనం, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారని అన్నారు. దమ్ముంటే నేరుగా రావాలని సవాలు విసిరారు. కాంగ్రెస్ ఏడు నెలలపాలనలో చేపట్టిన అభివృద్ధికార్యక్రమాలపై జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద చర్చకు సిద్ధంగా ఉన్నారా అని ప్రశ్నించారు. ఆదివాసీల మధ్య చిచ్చు పెట్టే కుట్ర జరుగుతోందని దీన్ని అందరూ గమనిస్తున్నారన్నారు. ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క ఆదివాసీవర్గానికి చెందిన వారని.. తనను ఏనాడు కూడా కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయలేదన్నారు. డీసీసీ అధ్యక్షుడు మా కార్యకర్తపై చేసిన వ్యాఖ్యలను నేను ఖండించానని పేర్కొన్నారు. పలువురు ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే కోవ లక్ష్మి దిష్టిబొమ్మను చెప్పులతో కట్టిన ఆత్రం సుగుణ భారీమూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. జాతిలో చిచ్చుపెట్టే విధంగా సుగుణ మాటలు ఉన్నాయన్నారు. అగ్రవర్ణాల చేతిలో ఆదివాసులు కీలుబొమ్మలు కావద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పోచయ్య, పుష్ప లత, నర్సింగ్‌రావు, యాదవరావు, కలాం, జడ్పీటీసీలు అజయ్ కుమార్, ద్రుపతాబాయి, ఎంపీపీ సౌందర్య, మండలాధ్యక్షుడు రవీందర్ పాల్గొన్నారు.

ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి: ఎస్పీ



పోలీసుస్టేషన్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

వాంకిడి, జూలై 3: పోలీసుస్టేషన్‌కు వచ్చే ప్రతిఫిర్యాదును ఆన్‌లైన్ నమోదు చేసి ఫిర్యాదుదారులకు రిసీప్ట్ ఇవ్వాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని పోలీసుస్టేషన్‌ను సందర్శించి రికార్డులను, స్టేషన్ పరిసరాలను, సిబ్బంది విధులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిసరాలను, గదులను, రికార్డులను ఎవరిపరిధిలో వారు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. స్టేషన్‌లో రోజువారీగా నిర్వహిస్తున్న జనరల్ డైరీ, సెంట్రీ రిలీవ్‌బుక్, డ్యూటీరోస్టర్, విలేజ్ రోస్టర్, ప్రాసెస్ రిజిస్టర్, బీట్ డ్యూటీబుక్స్, సస్పెక్ట్ చెక్ రిజిస్టర్, సుపీరియర్ ఆఫీసర్ విసిటింగ్ బుక్, ఫైనల్ రిపోర్టు తదితర రికార్డులను తనిఖీ చేశారు. ఏ రోజుకు ఆరోజు పెండింగ్ లేకుండా అప్‌డేట్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐలు రాణా ప్రతాప్, శ్రీనివాస్, ఎస్సై సాగర్, ఆర్ఎస్సై ఓదెలు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణ సాధన దీక్షను విజయవంతం చేయండి



దీక్ష పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆసిఫాబాద్ రూరల్, జూలై 3: ఎస్సీ వర్గీకరణ సాధనకు ఈ నెల7న ఇందిరాపార్కు వద్ద టీఎస్ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ చేపట్టనున్న దీక్షను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు రవి కోరారు. బుధవారం దీక్షకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకుల కాంతారావు, బాలేష్‌లక్ష్మణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వట్టివాగు ప్రాజెక్టు నుంచి సాగునీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న జడ్పీటీసీ, ఎంపీపీ

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 3: వట్టివాగు ప్రాజెక్టు సాగునీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. బుధవారం వట్టివాగు ప్రాజెక్టు కుడికాలువ ద్వారా ఇరిగేషన్ అధికారులతో కలిసి నీటినివిడుదల చేశారు. ఈసందర్భంగా వారుమాట్లాడుతూ వట్టివాగు ప్రాజెక్టు నీటిని సద్వినియోగం చేసుకుని సకాలంలో రైతులు వరినాట్లు వేసుకోవాలని తెలిపారు. వారివెంట నాయకులు సత్యనారాయణ, వెంకన్న, ఇరిగేషన్ అధికారి జాని, రైతులు ఉన్నారు.

బ్యాంకర్లు నిర్దేశిత రుణ లక్ష్యాలను పూర్తిచేయాలి: కలెక్టర్



వార్షిక ప్రణాళిక బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూలై 3: బ్యాంకర్లు నిర్దేశిత రుణలక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, బ్యాంకర్లతో జిల్లాస్థాయి సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్స రానికి నిర్దేశించిన రుణలక్ష్యాలను బ్యాంకర్లు సమన్వయంతో పనిచేసి సకాలంలో సాధించేలా కృషి చేయాలని తెలిపారు. బ్యాంకర్లకు కేటాయించిన లక్ష్యాల ప్రకారం వందశాతం రుణాలను రైతులు, మహిళాసంఘాలు, అర్హులైన లబ్ధిదారులకు అందించాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, జీవనజ్యోతి బీమా సురక్ష, అటల్ పెన్షన్‌యోజన సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. లబ్ధిదారులు పొందిన రుణాలుక్షేత్రస్థాయిలో సద్వినియోగం చేసుకునే విధంగా బ్యాంకర్లు, అధికారులు పర్యవేక్షించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ పంటరుణాలను మంజూరు చేసే వవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హత కలగిన లబ్ధిదారులకు రుణాలు మంజూరుచేసే విధంగా ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. షెడ్యూల్ కులాలు, వెనుకబడిన తరగతులు,మైనార్టీ కార్పొరేషన్లు, ట్రైకార్ ద్వారా మంజూరైన యూనిట్లకొరకు అందిన దరఖాస్తులలో అర్హులైన లబ్ధిదారులకు రుణం మంజూరు చేయాలని తెలిపారు. మహిళాశక్తి పథకంలో భాగంగా మహిళా సంఘాలను బలోపేతం చేసే దిశగా చేపల పెంపకం, డెయిరీఫార్మ్, కోళ్ల పెంపకం, క్యాంటీన్లు, కుట్టు శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు కృషిచేస్తున్న వారిని ప్రోత్సహిస్తూ రుణాలు అందించేందుకు నిబంధనల మేరకు చర్యలు తీసుకో వాలన్నారు. గ్రామాల్లో బ్యాంకు లావాదేవీలు, ఆర్థిక అక్షరాస్యత, సైబర్‌నేరాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని తెలిపారు. అనంతరం వార్షికప్రణాళిక బుక్‌లెట్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా అధికారి సాయితేజ రెడ్డి, నాబార్డు డీడీ వీరభద్రుడు, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ రాజేశ్వర్‌జోషి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై కేసు నమోదు

ఆసిఫాబాద్, జూలై 3: ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై మంగళవారం రాత్రి ఆసిఫాబాద్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదయినట్లు సీఐ సతీష్ తెలిపారు. జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావును ఎమ్మెల్యే కోవ లక్ష్మి అసభ్య పద జాలంతో దూషించడం, దుర్భాషలాడడం, హెచ్చరించ డంతో కాంగ్రెస్‌పార్టీ ఎస్టీ సెల్ నాయకుడు విశ్వనాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నిషేధిత గుట్కా పట్టివేత

కెరమెరి, జూలై 3: మండలంలోని సుర్దాపూర్ గ్రామంలో దాడులు చేసి గ్రామానికి చెందిన ఆదె తిరుపతి అనేవ్యక్తి వద్ద సుమారు రూ.1200విలువ చేసే నిషేదిత గుట్కా పట్టుకున్నట్లు ఎస్సై విజయ్ తెలిపారు. ఈ మేరకు తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: డీఈవో



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న డీఈవో అశోక్, సిబ్బంది

కాగజ్‌నగర్, జూలై 3: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యావరణాన్ని రక్షించుకున్నట్లయితే జీవన విధానానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుకర్, నోడల్ అధికారి దేవాజీ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకుల వేలం వద్దు

- ఉద్యమిస్తున్న సంఘాలు



ఎస్ఆర్పీ3 గనిపై మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్, జూలై 3: ప్రస్తుతం సింగరేణి ప్రాంతంలో వినిపిస్తున్నది ఒకటే మాట 'సింగరేణి బొగ్గు బ్లాకుల వేలం వద్దు'. అన్ని సంఘాలు నడుస్తున్నది ఒకటే బాట 'వేలం నిలిపివేయాలి'. సొంగరేణి తవ్విన బొగ్గు బ్లాకులను సింగరేణికే ఇవ్వాలి. ఈ విషయంలో కార్మిక సంఘాలకు, పార్టీల నాయకులకు ఎవరి స్వార్థం వారికున్నా.. సింగరేణి బొగ్గు బ్లాకుల వద్దకు వచ్చేసరికి అంతా ఒక్కటయ్యారు. వేలం ఆపాల్సిందే.. బొగ్గు బ్లాకులు సింగరేణికి ఇవ్వాల్సిందే అని నినదిస్తున్నారు.

సింగరేణికి నష్టం..

మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ (ఎంఎండిఆర్) యాక్ట్ ప్రకారం దేశవ్యాప్తంగా గనులను వేలం వేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో సింగరేణి గుర్తించి బొగ్గు ఉత్పత్తికి సిద్ధం చేసిన వాటిని వేలం ద్వారా ప్రైవేటు వ్యక్తులు పొందితే ఈ ప్రాంతంలోని యువతకు భవిష్యత్తు ఉండదని, తల్లిదండ్రులు, యూనియన్ నాయకులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నారు. ఎలాగైనా బొగ్గు గనుల వేలంను ఆపాలని ప్రయత్నిస్తున్నారు. గుజరాత్, ఒడిశా, తమిళనాడు, తదితర రాష్ట్రాల్లో ఆ రాష్ట్ర ప్రభుత్వాలుగానీ, పార్టీల నాయకులుగానీ అడుగగానే నామినేషన్ పద్ధతిలో ఆయా రాష్ట్రాలకు బొగ్గు బ్లాకులను కేటాయించారని, తెలంగాణలో ఇస్తే తప్పేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొత్త గనులు లేనిపక్షంలో సింగరేణికి భవిషత్తు ఉండదని, మరికొన్ని ఏళ్లల్లో కంపెనీ మూతపడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.



విద్యుత్ అమ్మకానికి ఒప్పందం



ఒప్పందం చేసుకుంటున్న ఎన్‌టీపీసీ -ఎస్టీపీపీ అధికారులు

జైపూర్, జూలై 3: జైపూర్‌లోని ఎస్టీపీపీలో మిగులు విద్యుత్ కొనుగోలుకు ఎన్టీపీసీ విద్యుత్ వ్యాపర్ నిగమ్ లిమిటెడ్ కంపెనీ బుధవారం ఎస్టీపీపీ అధికారులతో న్యూఢిల్లీలో ఒప్పందం చేసుకున్నట్లు సింగరేణి డైరెక్టర్(ఈఅండ్ఎం) సత్యనారాయణ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్టీపీపీలో మిగులు విద్యుత్‌ను టీజీ ఎస్ఎల్‌డీసీ అనుమతితో ఈ ఒప్పందం చేసుకున్నట్లు డైరెక్టర్ తెలిపారు. ఈ ఒప్పంద పత్రాలను ఎన్టీపీసీ విద్యుత్‌వ్యాపార్ నిగమ్ లిమిటెడ్ తరుపున ఎంఎస్ రేణునారంగ్, సింగరేణి కంపెనీ తరుపున డైరెక్టర్(ఈఅండ్ఎం) సత్యనారాయణరావు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. సింగరేణి థర్మల్ విద్యుత్‌కేంద్రంలో మిగులు విద్యుత్‌ను ఇలా బహిరంగ మార్కెట్‌లో విక్రయించడం ఇదే మొదటిసారి అని పేర్కొన్నారు. విక్రయించడం ద్వారా వచ్చిన లాభాలను రాష్ట్ర డిస్కంలు, సిగరేణి సమానంగా పంచుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జీఎం(సోలార్)జానకిరామ్, చీఫ్ ఆఫ్ ప్రాజెక్టు డివిజన్ విశ్వనాథరాజు, డీజీఎం (ఆర్‌అండ్‌సీ) జిష్ణుదత్త, ఎస్‌వోటూ ఈడీ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

కైరిగూడ ఓసీని సందర్శించిన జీఎం

రెబ్బెన, జూలై 3: బెల్లంపల్లి ఏరియా జీఎం(సేఫ్టీ) కె రఘుకుమార్ బుధవారం కైరిగూడను సందర్శించారు. ఈ సందర్భంగా రక్షణపై తీసుకుంటున్న చర్యలపై సిబ్బంది, అధికారులతో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి ఎన్ సత్యనారాయణ, పీఈ వీరన్న, మేనేజర్ ప్రవీణ్, సెఫ్టీ అధికారి మదుసూదన్, డీవైపీఎం వేణు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీఎం సెఫ్టీ అధికారి రఘుకుమార్‌ను ఘనంగా సన్మానించారు.

బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా నిరసనలు

మందమర్రి టౌన్, జూలై 3: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బొగ్గుగనుల వేలంకు వ్యతిరేకంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టే పోరాటాల్లో కార్మికులు కదం తొక్కాలని బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియాకార్యదర్శి సుదర్శన్ తెలిపారు. కేకే5గని వద్ద నిర్వహించిన మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణికి బ్లాకులు కేటాయించే వరకు తమ యూనియన్ ఆందోళన చేస్తుందన్నారు.

ప్రభుత్వాల దిష్టిబొమ్మ దహనం..

బొగ్గుగనుల వేలంకు వ్యతిరేకంగా బుధవారం మందమర్రిలో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం బీఆర్ఎస్ టీబీజీకేఎస్ కేంద్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ రాజశేఖర్, ఏరియా ఉపాధ్యక్షుడు సంపత్, పట్టణ అధ్యక్షుడు జె రవీందర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వంద వైఖరిని కార్మిక వర్గం నిలదీయాలన్నారు. వేలం రద్దు అయ్యేవరకు యూనియన్ ఎలాంటి పోరాటాలకైనా సిద్దంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బత్తుల శ్రీనివాస్, మద్ది శంకర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయండి..

శ్రీరాంపూర్: బొగ్గుగనుల వేలాన్ని నిరసిస్తూ ఈనెల5న చేపట్టనున్న బంద్, ఆందోళనలను విజయవంతం చేయాలనిఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం శ్రీరాంపూర్‌లోని పలు గనులపై యూనియన్ ఉప ప్రధానకార్యదర్శులు కె వీరభద్రయ్య, ముస్కెసమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కెబాజీసైదా ప్రచారంచేపట్టారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సంపత్, చంద్రమోహన్, బుచ్చన్న, పిట్ కార్యదర్శులు ఆకుల లక్ష్మణ్, మోతె లచ్చన్న, సదానందం, మల్లికార్జున్,తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి..

సింగరేణి బొగ్గు గనుల వేలంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కె సురేందర్ రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టెం లక్ష్మణ్ అన్నారు. వేలంను నిరసిస్తూ సీసీసీలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఆ యూనియన్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలు దహనం చేశారు. కార్యక్రమంలో యూనియన్ సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకుల వేలంను రద్దు చేయాలి..

కాసిపేట: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన బొగ్గు బ్లాకుల వేలాన్ని వెంటనే రద్దుచేయాలని ఏఐటీయూసీ కేంద్రకమిటీ కార్యదర్శి ఎండీ అక్బర్ అలీ అన్నారు. బుధవారం కాసిపేట2వ గనిలో నిర్వహించిన గేట్‌మీటింగ్‌కు ఆయన హాజరై మాట్లాడారు. సింగరేణిసంస్థకు నామినేషన్ పద్దతి ద్వారానే బొగ్గుబ్లాకులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచీ కార్యదర్శి దాగం మల్లేష్, ఇప్పకాయల లింగయ్య, గొల్లశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: సింగరేణిలోని బొగ్గు బ్లాకుల వేలం వెంటనే రద్దు చేయాలిన ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి తెలిపారు. బుధవారం ఖైర్‌గూడ ఓపెన్‌కాస్టు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 5నుంచి 18వరకు ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. అలాగే శ్రావణపల్లి బొగ్గు బ్లాకు సింగరేణికి కేటాయించాలని డిమాండు చేశారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు చర్యలు

- కోట్లాది మొక్కలు నాటిన సింగరేణి



మాట్లాడుతున్న జీఎం మనోహర్

మందమర్రి టౌన్, జూలై 3: పర్యావరణ పరిరక్షణకు సింగరేణి యాజమాన్యం ప్రత్యేకచర్యలు చేపడుతుందని మందమర్రి జీఎం మనోహర్ తెలిపారు. బుధవారం ఏరియాలోని కేకే2బంగ్లాస్ ఏరియాలో 75వ వనమహోత్సవ కార్యక్రమం సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలందరికీ మొక్కలు పంపిణీ చేస్తున్నామని, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటుతూ ప్రజల్లో స్పూర్తి నింపుతున్నామన్నారు. సీఎండీ బలరాం స్పూర్తితో సింగరేణి అంతా పచ్చదనంతో నిండుకుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఐఈడీ రాజన్న, డీజీఎం ఎఫ్అండ్‌ఏ రవి, ఎఫ్అండ్‌ఏ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలాన్ని ఉపసంహరించుకోవాలి

- టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం

మందమర్రి టౌన్, జూలై 3: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బొగ్గుగనుల వేలం సరైంది కాదని, వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ కుట్రలను అన్ని కార్మిక సంఘాలు ఒకే తాటిపైకి వచ్చి సంఘటిత పోరాటాలు చేస్తేనే ఫలితం ఉంటుందన్నారు. ఈసమావేశానికి హెచ్ఎంఎస్ ప్రధానకార్యదర్శి రియాజ్ అహ్మద్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఐఎఫ్టీయూ అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు రాములు నాయక్, ప్రొఫెసర్ హరగోపాల్, సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.